క్లుప్తంగా

స్వర్ణ, రజత పుష్పాలతో మరిడమ్మకు పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల తనిఖీ


గొల్లప్రోలులో పశువైద్యశాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు ఏరియా పశువుల ఆస్పత్రిని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎస్.సూర్యప్రకాశరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఉప సంచాలకులు ఆర్. వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలు, దుర్గాడ పశు వైద్య శాలలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: నకిలీ బంగారం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పాడ బీచ్‌రోడ్డులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా గుంటూరుకు చెందిన తిరుపతి వెంకటయ్య తన మోటార్ సైకిల్‌లో సుమారు 100 గ్రాముల నకిలీ బంగారం బిస్కెట్‌ను తరలిస్తున్నట్లు గుర్తించారు. తరలిస్తున్న నకిలీ బంగారం బిస్కెట్‌ను, విక్రయించేందుకు తీసుకువెళుతున్న 4 మద్యం సీసాలను, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని వెంకటయ్యను అరెస్టు చేశారు. గొల్లప్రోలుకు చెందిన కాసా వెంకటేశ్వరావుకు తక్కువ రేటుకే బంగారం ఇప్పిస్తామని చెప్పి నకిలీ బంగారాన్ని ఇచ్చి వెంకటయ్య మోసం చేసినట్టు ఫిర్యాదు అందిందన్నారు. ఏ ఒక్కరూ దురాశపడి మోసగాళ్ల చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్సై రామలింగేశ్వర రావు సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు శివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై సీఐ కె.దుర్గాప్రాద్ తన బృందంతో శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఈ మేరకు పేకాట శిబిరంలో ఉన్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.7,300 స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి ఆయన దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజ్ఞ వికాస పరీక్షకు విశేష స్పందన

కాకినాడ సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస పరీక్షకు జిల్లాలో విశేష స్పందన వచ్చిందని, ఆ సంస్థల జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు తెలిపారు. శుక్రవారం మొదటి రోజు పరీక్షను స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించినట్లు తెలిపారు.

ఆర్జేడీగా నాగమణి బాధ్యతల స్వీకరణ


ఆర్జేడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగమణి

కాకినాడ సిటీ: పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి శుక్రవారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆర్జేడీ మధుసూదనరావు బదిలీ అయ్యారు. నాగమణి ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయినిగా 11 ఏళ్లు పనిచేసి, 2017–21 మధ్య విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో డీఈఓగా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో పాఠశాల విద్య జేడీగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై కాకినాడ వచ్చారు. ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ పాఠశాలల్లో గుణాత్మక విద్య పెంపొందించేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పరీక్షలు పారదర్శకంగా నిర్వహించి నూరుశాతం ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆమెను కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు, ప్రతినిధులు, తదితరులు కలిసి అభినందించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియలను మర్యాదపూర్వకంగా కలిశారు.

జగన్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- హౌసింగ్ చైర్మన్ దొరబాబు
- గృహ సారథులకు దిశానిర్దేశం


సామర్లకోటలో గృహ సారథుల శిక్షణలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు


పెద్దాపురంలో సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహ సారథులు

పెద్దాపురం: ఏ రాష్ట్రంలో జరగని సంక్షేమ పాలనను ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడమే లక్ష్యం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం క్యాంపు కార్యాలయ ఆవరణలో శుక్రవారం పట్టణ పరిధిలోని ఆయా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ పార్టీ రహితంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. 2024లో సీఎంగా జగన్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని దొరబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో వలంటీర్లు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో గృహ సారథులను ఏర్పాటు చేశారని, వలంటీర్లు అందిస్తున్న ప్రజా సంక్షేమ సేవలపై గృహ సారథులు అవగాహన పెంచుకుని సమష్టి కృషితో జగన్ గెలుపుకు కృషి చేయాలని దొరబాబు కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మహారాణి సత్రం మాజీ చైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ కరోనా కాలంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. అనంతరం గృహ సారథులు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు, విడదాసరి రాజా, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, తలారి శ్యామలత, ధర్మేంద్ర, ఆయా వార్డులు వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం కావాలి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తూ, ప్రభుత్వ ఆలోచనలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి గృహ సారథులు పని చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు స్థానిక గాంధీచౌక్ రైతు భవనంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై అవగాహన పెంచడంతో పాటు గత ప్రభుత్వ పాలన కంటే మన ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతుందనే విషయాలను తెలియజేయాలన్నారు. జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదంతో గృహ సారథులు పని చేయాలని చెప్పారు. ప్రతీ ఇంటిని సందర్శించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న గృహ సారథులకు కిట్లు అందజేయడం జరుగుతుందని చెప్పారు. కిట్లలో ఉన్న కరపత్రాలను చదివి ప్రతీ ఇంటికీ వివరించి అందజేయాలన్నారు.

మహిళలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారు...

మహిళల కోసం సీఎం జగన్ పని చేస్తున్నారని, మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించవచ్చునని అయ్యారక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే దవులూరి దొరబాబు గెలుపునకు గృహ సారథులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, రెండో వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమ, జట్ల మోహన్, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, గుబ్బల సత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి 15 వరకు పీబీ దేవం గేటు మూసివేత



పీబీ దేవం గ్రామంలోని రైల్వే గేటు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని గేటు నెంబరు 421 పీబీ దేవం గ్రామంలోని రైల్వే గేటు ఈ నెల 13 నుంచి 15 వరకు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ దాసరి సాయిశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో ట్రాక్ మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని గేటు మీదుగా రాక పోకలు జరగకుండా గేటు మూసివేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్, ఆ గ్రామ సర్పంచ్, పోలీసుస్టేషన్, ఆటో, లారీ యూనియన్ ప్రతినిధులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కాగా గ్రామం అంతా రైల్వే గేటు ఆవలి వైపు ఉండటం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది. చిన్న వాహనాల రాకపోకలకు గ్రామ శివారులో రైల్వే కాను ఉంది. గేటు మూసివేతతో రైల్వే కాను మీదుగా రాకపోకలు పెరిగే అవకాశం ఉంటుంది.

ఆధ్యాత్మికతతో మనసుకు దిశానిర్దేశం


సభకు హాజరైన పీఠం సభ్యులు


సభలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: ఆధ్యాత్మికత మనసుకు దిశనిర్దేశం చేస్తుందని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం ఆశ్రమ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పీఠం 95వ వార్షిక మహా సభల్లో శుక్రవారం ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. మానవుడిలో మంచి చెడులను ప్రేరేపించేది మనసు అన్నారు. మనసులో భావాలను బట్టి మనిషి మనుగడ ఉంటుందన్నారు. మానవుడు రాక్షసత్వం వీడి ఈశ్వరతత్వం వైపు పయనించాలంటే ఆధ్యాత్మిక తత్వాన్ని గ్రహించాలన్నారు. ఆధ్యాత్మికతతో తాత్విక జ్ఞానం పొంది మనసును మంచి మార్గం వైపు మరల్చుకోవచ్చన్నారు. పీఠం ద్వారా అందిస్తున్న ధ్యాన, జ్ఞాన, మంత్ర సాధనలతో కూడిన త్రయిసాధన అవలంబించడం ద్వారా మనసులో ఉద్భవించే చెడు భావనలను నియంత్రించవచ్చన్నారు. ఈ సందర్భంగా సభకు వచ్చిన వివిధ మతాలకు చెందిన ప్రతినిధులతో చేతులు కలిపి మత సామరస్యానికి సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతిఒక్కరూ పాటు పడాలని ఆయన పిలుపు నిచ్చారు. అనంతరం పీఠం రూపొందించిన వివిధ కరపత్రాలను, ఆధ్యాత్మిక గ్రంధాలను ఆయన ఆవిష్కరించారు. మాజీ మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా చేస్తున్న సమాజ సేవలను కొనియాడారు. మదర్ ఇండియా ఇంటర్ నేషనల్, తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల రక్షణ సమితి సభ్యులు ఉమర్ ఆలీషాను విశ్వజ్ఞాన సరస్వతీ అనే బిరుదుతో అవార్డును అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ సభ్యులు పేరూరి విజయరామ సుబ్బారావు, అడబాల వెంకి, నూతక్క, అబ్బిరెడ్డి అనూష, బి.హర్షిణి, డాక్టర్ పద్మావతి, ఏవీవీ సత్యనారాయణ, శివరామకృష్ణ, అమీర్ బాషా, గోసుల రమణ, జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు, న్యాయమూర్తి చెరుకూరి రఘుపతి వసంత కుమార్, డాక్టర్ విలియమ్స్, భవానీ పీఠం అధిపతి శివరామకృష్ణ, పంచాగ కర్త బానాల దుర్గాప్రసాదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీకి చర్యలు

డ్వామా పీడీ వెంకటలక్ష్మి


శ్రీరాంపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

కొత్తపల్లి: ప్రతి మండలంలోనూ నర్సరీలను ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకున్నామని డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని శ్రీరాంపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. మస్తర్లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాలకు గానూ రోజుకు 50 వేల మందికి ఉపాధి పని కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉండడం వలన 25 వేల మంది మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామన్నారు. జిల్లాలో 4,52,000 ఉపాధి జాబ్ కార్డులకు గాను 32 వేల కార్డులకు ఆధార్ అనుసంధానం చేయవలసి ఉందన్నారు. ఈ– కేవైసీ చేయించుకోక పోవడం వలన అనుసంధానం జరగలేదని ఆమె తెలిపారు. మునగ మొక్కలను పెంచేందుకు రైతులు ఆసక్తి కనబరిస్తే హార్టీ కల్చర్ ద్వారా ఎకరానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచిచారు. అనంతరం ఆమె పొన్నాడలో బషీర్‌బీబీని దర్శించుకున్నారు. అలాగే సప్తగిరి హేచరీస్ ఎండీ పెదబాబు కూడా బషీర్‌బీబీని దర్శించుకున్నారు. ఆమె వెంట ఏపీఓ రాజబాబు ఉన్నారు.

14 నుంచి 19 వరకు ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన

కాకినాడ సిటీ: జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 19వతేదీ వరకు కాకినాడ దేవాలయం వీధిలోని పైడా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి కె పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. ఈ ప్రదర్శనను ఈ నెల 14న కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కాటన్, మెర్సిడైజ్‌డ్, టై అండ్ డై చీరలు, సీకో చీరలు, మాధవరం, వెంకటగిరి జరీ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్, ఉప్పాడ జాంధాని చీరలు, కాటన్ షర్టింగ్స్, కలంకారి వస్త్రాలు, పొందూరు ఖద్దరు, పెద్దాపురం సిల్క్ షర్టింగ్స్ ఉంటాయన్నారు. వీటితో పాటు ప్రఖ్యాతి గాంచిన బెడ్ షీట్స్, పేరెన్నిక గన్న ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రం నలుమూలల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 30 చేనేత సహకార సంఘాల ఉత్పత్తిదారులు పాల్గొంటున్నారని పెద్దిరాజు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని, చేనేత ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచామన్నారు. కాకినాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత వస్త్రాలను ధరించి నేత కార్మికులకు చేయూత నివ్వాలని జౌళిశాఖ అధికారి పెద్దిరాజు కోరారు.

నన్నయలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ కమలకుమారి. చిత్రంలో వైడీ రామారావు, మాణిక్‌రెడ్డి సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పీజీ సెంటర్ ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మాణిక్‌రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, సిబ్బంది, విద్యార్థులతో పాటు ఆదిత్య కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ చైర్మన్ వైడీ రామారావు, మాణిక్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ మాణిక్ రెడ్డి సత్యనారాయణ పాల్గొని రక్తదానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. శిబిరం ఏర్పాటు చేసిన క్యాంపస్ ఎంఎస్ఎన్ అధికారులు మధుకుమార్, శ్రీనివాసరావులను అభినందించారు. రాజ్‌కుమార్ రెడ్డి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పులిమేరులో మిన్నంటిన ఆర్తనాదాలు

- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు
- సామర్లకోట నుంచి మృతదేహాలతో ర్యాలీ
- అంత్యక్రియలకు భారీగా హాజరైన గ్రామస్తులు


దుర్గాప్రసాద్ మృతదేహాన్ని చూసి రోదిస్తున్న భార్య సత్య


పులిమేరు యువకుల మృతదేహాలను ర్యాలీగా తీసుకువస్తున్న యువత

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా కలచివేసిన జి.రాగంపేట అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటనలో పులిమేరుకు చెందిన ఇద్దరు యువకుల మృతితో రెండు రోజులుగా ఆయా కుటుంబాల ఆర్తనాదాలు మిన్నంటాయి. యల్లమిల్లి విజయదుర్గాప్రసాద్ (27), కట్టమూరు జగదీష్ (25) మృతదేహాలు శుక్రవారం కాకినాడ జీజీహెచ్ నుంచి శవపంచానామా అనంతరం సామర్లకోట వరకు వచ్చాయి. అంబులెన్స్‌కు ముందు పులిమేరు గ్రామ యువత ఆధ్వర్యంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు బోనాసు గుర్రాజు, సుందరెడ్డి రాజు, ఎద్దు కుమార్‌ల పర్యవేక్షణలో బైక్ ర్యాలీతో మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చి కటుంబ సభ్యులకు చూపించారు. మృతుల ఇళ్లు పక్కపక్కనే కావడంతో గ్రామస్తులంతా వారి ఇళ్లకు చేరుకున్నారు. నిండు గర్భిణి అయిన దుర్గాప్రసాద్ భార్య సత్య, తండ్రి నూకరాజు, తల్లి వెంకటలక్ష్మి, కట్టమూరి జగదీష్ తల్లి లక్ష్మి మృతదేహాలను చూసి పెట్టిన ఆర్తనాదాలతో గ్రామస్తులంతా కన్నీటి పర్యంతమాయ్యరు. వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించి శ్మశానవాటిక వరకు గ్రామస్తులు ర్యాలీగా వెళ్లారు. రెవెన్యూ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: మూలపేట–నాగులాపల్లి రోడ్డులో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైనట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం జిల్లాకు చెందిన పలువురు ముస్లింలు పొన్నాడలో జరుగుతున్న బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) ఉరుసు ఉత్సవాలకు ఆటోలో వస్తున్నారు. పొన్నాడ ఎస్సీ పేట సమీపంలో నాగులాపల్లి నుంచి వస్తున్న ఇసుకలోడు ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ధర్నా



పిఠాపురంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ముసాయిదా బడ్జెట్ దుర్మార్గంగా ఉందని సీపీఎం నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్ నిరసిస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం పిఠాపురంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కరణం విశ్వనాథం, కె.నాగేశ్వరరావు, కె.మణి, జి.వీరబాబు, ఎం.సూరిబాబు, కె. సింహాచలం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రూ.60 వేల కోట్లు తగ్గించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పేదలను నట్టేట ముంచేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యకు మార్గం

- విశాలంగా రహదారి నిర్మాణం
- అమ్మాణమ్మ అపార్ట్‌మెంట్‌వాసులకు తప్పిన పుంతరోడ్డు వెతలు


అమ్మాణమ్మ అపార్టుమెంటు వాసులు వినియోగిస్తున్న ప్రైవేటు లే అవుట్ ద్వారా ఉన్న మార్గం


అమ్మాణమ్మ అపార్టుమెంట్‌కు నిర్మితమవుతున్న సీసీ రోడ్డు

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేటలోని అమ్మాణమ్మ అపార్టుమెంట్ వాసుల దీర్ఘకాలిక సమస్యకు మోక్షం లభించనుంది. 916 ఇళ్ల సముదాయంతో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2009లో అపార్టుమెంటు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన తరువాత పనులు నెమ్మదించినా, తరువాత పూర్తయ్యి 2016లో అప్పటి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అపార్టుమెంటును ప్రారంభించారు. కాగా అపార్టుమెంటు వాసులు రాక పోకలకు పుంత రోడ్డు మాత్రమే ఉంది. వర్షం వస్తే బురదతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో సమీప ప్రైవేటు లే అవుట్ల మీదుగా రైల్వే స్టేషన్, బస్ కాంప్లెక్స్‌లకు చేరుకునేవారు. దాంతో అదనంగా మూడు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. అలాగే ఆ యజమానుల నిరసనలనూ అపార్ట్‌మెంట్ వాసులు ఎదుర్కొనవలసి వచ్చేది. ఈ నేపథ్యంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు జోక్యం చేసుకొని ప్రైవేటు లే అవుట్ యజమానికి నచ్చచెప్పి రాకపోకలకు అనుమించేలా చేశారు. అమ్మాణమ్మ అపార్టుమెంటు సమీపంలోనే 436 ఇళ్ల సముదాయంతో టిడ్కో ఇళ్లు పూర్తి కావడంతో రోడ్డు నిర్మించదలచి రూ.1.50 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం, పనులు ప్రారంభించడం జరిగింది. ఈ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాంట్రాక్టర్ రెడ్నం దొరబాబు పనులు చురుగ్గా చేస్తుండడంతో మరో వారంలో పనులు పూర్తి కానున్నాయి.

పోరాటాలు చేశాం



గత టీడీపీ పాలనలో తమ రాకపోకలకు పుంత రోడ్డు నిర్మించాలని ఆందోళనలు చేశాం. వైఎస్సార్ సీపీ నాయకుడు దవులూరి దొరబాబు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ రోడ్డుపై ప్రతి రోజు రెండు వేల మంది రాక పోకలు సాగించే అవకాశం ఉంది.

– పిల్లా సత్తిబాబు, అమ్మాణమ్మ అపార్టుమెంటు వాసి, సామర్లకోట

ప్రాధాన్యం గుర్తించి నిధుల కేటాయింపు



మున్సిపాలిటీకి మంజూరైన నిధులతో దవులూరి దొరబాబు సూచనల మేరకు ఈ రహదారికి నిధులు కేటాయించాం. దీర్ఘ కాలిక సమస్యగా ఉన్న ఎఫ్‌సీఐ రహదారిని పూర్తి చేశా. అలాగే అమ్మాణమ్మ అపార్టుమెంట్ రోడ్డు పనులూ వేగంగా జరుగు తున్నాయి.

– గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్, సామర్లకోట

నేడు ఘంటసాల వర్ధంతి

కాకినాడ కల్చరల్: సీతారామరాజు స్మారక కళావేదిక అనుబంధ సంస్థ ఘంటసాల సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక బాల త్రిపుర సుందరి ఆలయం సెంటర్‌లోని అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరావు కాంస్య విగ్రహం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు ఆయన వర్ధంతి నిర్వహిస్తున్నారు. కళాపీఠం కన్వీనర్ పంపన దయానందబాబు ఈ మేరకు తెలిపారు. కళాపీఠం సభ్యులు, ఘంటసాల అభిమానులు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


రోటరీ సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి రజని

బోట్‌క్లబ్: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జిల్లా హెడ్ సిస్టర్ రజని అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో శుక్రవారం జరిగిన రోటరీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మనస్సును శాంతి కాముకులుగా మలుచుకుంటే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. అనంతరం పీస్ , ఇంటిగ్రేషన్ అంశంపై ప్రసంగించారు. నూతనంగా రోటరీ సభ్యత్వం స్వీకరించిన చందు, అడబాల ప్రభలకు రోటరీ గవర్నర్‌గా ఎన్నికైన కల్యాణ్‌చక్రవర్తి రోటరీ పిన్‌ను బహూకరించారు. కల్యాణ్‌చక్రవర్తిని, సీనియర్ సభ్యులైన జయరామ్ దంపతులను సత్కరించారు. క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభి శారద, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తడాల వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.